Email : telanganaveenaoffcial@gmail.com
Title Code : 12280
# తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
స్పాట్ ఎడిషన్
epaper.telanganaveena.com హైదరాబాద్ బుధవారం 26.06.2024

# పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ, ప్రధాని మోదీ మధ్య ఆసక్తికర సన్నివేశం..



* ఓం బిర్లాకు స్వాగతం పలుకుతూ మోదీ, రాహుల్ గాంధీ కరచాలనం
* లోక్ సభలో ఇండియా కూటమి తరఫున విపక్ష నేతగా రాహుల్ గాంధీ
* దీంతో పార్లమెంట్‌లో స్పెషల్ ఎట్రాక్షన్‌గా మారిన కాంగ్రెస్ అగ్రనేత

తెలంగాణవీణ,జాతీయం

పార్లమెంట్‌లో లోక్‌సభ స్పీకర్ ఎన్నిక సందర్భంగా ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మధ్య ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. 18వ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లాకు స్వాగతం పలుకుతూ మోదీ, రాహుల్ గాంధీ కరచాలనం చేసుకున్నారు. ఇక లోక్ సభలో ఇండియా కూటమి తరఫున విపక్ష నేతగా రాహుల్ గాంధీ ఎన్నికైన విషయం తెలిసిందే. దీంతో పార్లమెంట్‌లో ఆయన స్పెషల్ ఎట్రాక్షన్‌గా మారారు. మొన్నటి వరకు గుబురు గడ్డంతో కనిపించిన ఆయన ట్రిమ్ చేయించి కొత్తగా కనిపిస్తున్నారు. ఎంపీగా ప్రమాణస్వీకారానికి కూడా టీషర్ట్ ధరించి వచ్చిన రాహుల్.. ఈరోజు ట్రెడిషనల్ పొలిటిషియన్ గెటప్‌లో ఆకట్టుకున్నారు. తెల్లటి కుర్తాపైజామాలో వచ్చిన ఆయనను కాంగ్రెస్ ఎంపీలతో పాటు, మిగతా పార్టీల నాయకులు రాహుల్ న్యూలుక్‌ను ఆసక్తిగా గమనించారు. ఇక ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు స్వీకరించేందుకు సిద్దంగా ఉన్న రాహుల్ గాంధీ ఈ కీలక పదవిలో గాంధీ కుటుంబ వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. ఆయన తల్లి సోనియా గాంధీ 1999 నుండి 2004 వరకు ఈ పదవిలో కొనసాగారు. అలాగే ఆయన తండ్రి రాజీవ్ గాంధీ 1989 నుండి 1990 వరకు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు.కొత్త స్పీకర్ ఓం బిర్లాకు ఇరువురు నేతల అభినందనలు"ఈ కుర్చీకి మీరు తిరిగి ఎన్నికైనందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను" అని ఓం బిర్లాకు మోదీ తెలిపారు. ఈ సందర్భంగా రాబోయే ఐదేళ్లలో బిర్లా నాయకత్వంపై ప్రధాని ఆశావాదాన్ని వ్యక్తం చేశారు. బిర్లా స్నేహపూర్వక ప్రవర్తనను ఆయన మెచ్చుకున్నారు. ఇది సభలో సానుకూల వాతావరణాన్ని పెంపొందిస్తుందని నమ్ముతున్నట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు.మొత్తం ప్రతిపక్షం, భారత కూటమి తరపున అభినందనలు" అని రాహుల్ గాంధీ అన్నారు. ఈ సందర్భంగా పార్లమెంటులో ప్రజల అంతిమ వాయిస్‌గా బిర్లా పాత్రను కాంగ్రెస్ నేత అభివర్ణించారు.

# జీవన్‌రెడ్డికి సోనియా గాంధీ ఫోన్

తెలంగాణవీణ, హైదరాబాద్

* వెంటనే ఢిల్లీ రావాల్సిందిగా జీవన్ రెడ్డికి ఏఐసీసీ నుండి పిలుపు
* బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌ను పార్టీలో చేర్చుకోవడంతో అలకబూనిన జీవన్‌రెడ్డి
* తన భవిష్యత్తు కాలమే నిర్ణయిస్తుందని ప్రకటన
* జీవన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను బుజ్జగించిన మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు



కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి ఢిల్లీ నుండి కాల్ వచ్చింది. జీవన్‌రెడ్డికి సోనియా గాంధీ ఫోన్ చేశారు. వెంటనే ఢిల్లీ రావాల్సిందిగా జీవన్ రెడ్డికి ఏఐసీసీ నుండి పిలుపు వచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌ను పార్టీలో చేర్చుకోవడంతో జీవన్‌రెడ్డి అలకబూనారు. దీంతో తన పదవికి రాజీనామా చేస్తానని ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. తన భవిష్యత్తు కాలమే నిర్ణయిస్తుందని ప్రకటించారు.

ఇక ఆదివారం మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు జీవన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను బుజ్జగించారు. ఈరోజు భట్టి ఢిల్లీకి వెళ్లిన కాసేపటికే అధిష్ఠానం నుంచి ఆయనకు పిలుపు వచ్చింది. దీంతో కాసేపట్లో ఢిల్లీకి జీవన్‌రెడ్డి వెళ్లనున్నారని సమాచారం. విప్ అడ్లూరి లక్ష్మణ్ కూడా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తో ఢిల్లీ వెళ్లనున్నారు.

# భారత్‌తో సత్సంబంధాలకు పాకిస్థాన్ సంకేతాలు

తెలంగాణవీణ,జాతీయం

* శాశ్వత శత్రుత్వాన్ని పాక్ విశ్వసించబోదన్న ఆ దేశ డిప్యూటీ పీఎం
* భారత్‌లో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం ఈ దిశగా ఆలోచిస్తుందని ఇషాక్ దార్ ఆశాభావం
* అంతమాత్రాన ఏకపక్ష, ఆధిపత్య విధానాలను అంగీకరించబోమని స్పష్టీకరణ



చూస్తుంటే భారత్ విషయంలో పాకిస్థాన్ క్రమంగా తన వైఖరిని మార్చుకుంటున్నట్టు కనిపిస్తోంది. ఇండియా పేరు వింటేనే కుతకుత ఉడికిపోయే పాక్ ఇప్పుడు సత్సంబంధాలకు సిద్ధమంటూ సంకేతాలు పంపిస్తోంది. భారత్‌తో శాశ్వత శత్రుత్వాన్ని పాకిస్థాన్ కోరుకోవడం లేదని, దాయాది దేశంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం ఈ విషయంలో సానుకూలంగా వ్యవహరిస్తుందన్న ఆశాభావాన్ని పాకిస్థాన్ డిప్యూటీ ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ వ్యక్తం చేశారు. ఇస్లామాబాద్‌తో సంబంధాల పునరుద్ధరణ విషయంలో భారత్ హుందాగా వ్యవహరిస్తుందని భావిస్తున్నట్టు తెలిపారు.ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్ట్రాటజిక్ స్టడీస్ ఇస్లామాబాద్ (ఐఎస్ఐఎస్)లో మంగళవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పొరుగు దేశాలతో పాకిస్థాన్ ఎప్పుడూ మంచి సంబంధాలనే కోరుకుంటుందని 74 ఏళ్ల ఇషాక్ దార్ పేర్కొన్నారు.'తూర్పున ఉన్న భారతదేశంతో సంబంధాలు చారిత్రక సమస్యగా మారాయి. పాకిస్థాన్ శాశ్వత శత్రుత్వాన్ని ఎన్నడూ విశ్వసించదు. పరస్పర గౌరవం, సార్వభౌమ సమానత్వం, జమ్మూకశ్మీర్‌పై దీర్ఘకాలంగా ఉన్న వివాదానికి న్యాయమైన, శాంతియుత పరిష్కారం ఆధారంగా భారత్‌తో మంచి సంబంధాలు కోరుకుంటున్నాం" అని చెప్పుకొచ్చారు. నిర్మాణాత్మక చర్చలను పాకిస్థాన్ కోరుకుంటోందని, అంతమాత్రాన ఏకపక్ష, భారత్ ఆధిపత్య విధానాలను మాత్రం పాకిస్థాన్ ఎప్పటికీ అంగీకరించబోదని దార్ తేల్చి చెప్పారు.

# ఈ నెల 29న కొండగట్టుకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



తెలంగాణవీణ, ఏపీ బ్యూరో

* అంజన్నకు ప్రత్యేక పూజలు చేయనున్న జనసేనాని
* వారాహి దీక్ష కొనసాగిస్తున్న పవన్
* స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులతో బుధవారం సమీక్ష

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ ఈ నెల 29న తెలంగాణలోని కొండగట్టు ఆలయానికి రానున్నారు. వారాహి దీక్షలో ఉన్న పవన్.. కొండగట్టు అంజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం బాధ్యతలు చేపట్టాక తొలిసారి కొండగట్టుకు వస్తున్న పవన్ కల్యాణ్ కు జనసేన కార్యకర్తలు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ వారాహి దీక్షలో ఉన్న విషయం తెలిసిందే. 11 రోజుల పాటు కొనసాగనున్న ఈ దీక్షలో భాగంగా పవన్ కేవలం పండ్లు, పాలు మాత్రమే ఆహారంగా స్వీకరిస్తున్నారు. అయితే, దీక్షలో ఉన్నప్పటికీ పవన్ చెప్పులు ధరించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అమ్మవారి బట్టల్లో నుదుట బొట్టుతో కనిపిస్తున్న పవన్ కాళ్లకు చెప్పులు ధరించిన ఫొటోను నటి శ్రీరెడ్డి సోషల్ మీడియాలో షేర్ చేశారు. దీంతో ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మరోవైపు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బుధవారం ఉదయం మంగళగిరిలోని తన నివాసంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులతో భేటీ అయ్యారు. కార్పొరేషన్ చేపడుతున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆయా కార్యక్రమాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు.

# ఓం బిర్లాకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

వరుసగా రెండోసారి లోక్‌సభ స్పీకర్‌గా ఎన్డీఏ అభ్యర్థి ఓం బిర్లా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. 18వ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లాకు అభినందనలు. మన పార్లమెంటరీ సంప్రదాయాలను నిలబెట్టి, చిత్తశుద్ధితో, విజ్ఞతతో సభను నడిపించడంలో ఆయన విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని చంద్రబాబు ట్వీట్ చేశారు.

# ఆస్కార్ అకాడమీ నుంచి రాజమౌళి దంపతులకు ఆహ్వానం!

అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ఇటీవల 487 మంది కొత్త సభ్యులకు ఆహ్వానాలు అందజేసింది. ఇందులో భారతీయ ప్రముఖులైన ఎస్ఎస్ రాజమౌళి, ఆయన భార్య రమా రాజమౌళి, షబానా అజ్మీ, రితేష్ సిధ్వానీతో పాటు ఇతరులకు ఆస్కార్ అవార్డులు అందజేసే అకాడమీలో సభ్యత్వ ఆహ్వానం అందింది. ఈ ఆహ్వానితుల్లో 71 మంది ఆస్కార్ నామినీలు, మరో 19 మంది ఆస్కార్ విజేతలు కూడా ఉన్నారు. కాగా, ఆస్కార్ అకాడమీ ఆహ్వానం అందుకున్న సెలబ్రిటీల్లో సినిమాటోగ్రాఫర్ రవి వర్మన్, ఫిల్మ్‌మేకర్ రిమా దాస్, నాటు నాటు సాంగ్ కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్ కూడా ఉన్నారు. ఆహ్వానం అందిన ప్రతి ఒక్కరూ ఆ కమిటీలో చేరితే అప్పుడు మొత్తం సభ్యుల సంఖ్య 10, 910కి చేరుతుంది. ఇందులో సుమారు 9 వేల మంది ఆస్కార్ వేడుకల సమయంలో ఓటు వేయడానికి అర్హులు.ఇక అకాడమీ పత్రికా ప్రకటన ప్రకారం.. 2024 ఆహ్వాన జాబితాలో 44 శాతం మహిళలు, 41 శాతం ఎథ్నిక్ కమ్యూనిటీలు ఉన్నట్లు ఉన్నారు. యూఎస్ కాకుండా 56 దేశాలకు చెందిన ప్రముఖులు ఆహ్వానం అందుకున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా అకాడమీ సీఈఓ బిల్ క్రామెర్, అధ్యక్షుడు జానెట్ యాంగ్ హర్షం వ్యక్తం చేశారు. "ఈ సంవత్సరం అకాడమీకి కొత్త సభ్యులను స్వాగతిస్తున్నందుకు మేము సంతోషిస్తున్నాము. ప్రపంచదేశాలకు చెందిన అసాధారణ ప్రతిభావంతులైన కళాకారులు, నిపుణులు మా చిత్రనిర్మాణ రంగంపై గణనీయమైన ప్రభావాన్ని చూపారు. అలాంటి వారిని ఆహ్వానించడం ఆనందంగా ఉంది" అని వారు పేర్కొన్నారు. ఇక బహుళ శాఖలలో ఆహ్వానం అందిన వ్యక్తులు సభ్యత్వం కోసం ఏదో ఒక శాఖను ఎన్నుకోవాల్సి ఉంటుంది.

# మహిళా జర్నలిస్టుపైకి కుక్కలను వదిలిన ఒడిశా మాజీ మంత్రి

* అధికారిక నివాసంలో మాజీ ఎమ్మెల్యే అక్రమ నిర్మాణాలు
* ఎన్నికల్లో ఓటమి తర్వాత ఖాళీ చేయాల్సి రావడంతో కూల్చివేత
* న్యూస్ కవరేజ్ కు వెళ్లిన జర్నలిస్టుపై మాజీ మంత్రి రఘునందన్ దాస్ సీరియస్
* పోలీసులకు ఫిర్యాదు చేసిన జర్నలిస్ట్

ఒడిశాలో దారుణం చోటుచేసుకుంది. న్యూస్ కవరేజ్ కోసం వెళ్లిన ఓ మహిళా జర్నలిస్టుపై మాజీ మంత్రి రఘునందన్ దాస్ తన పెంపుడు కుక్కలను వదిలిపెట్టాడు. దీంతో జర్నలిస్టుతో పాటు కెమెరామ్యాన్ కు గాయాలయ్యాయి. రఘునందన్ దాస్ పై జర్నలిస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాబీ దాస్ గా పిలుచుకునే మాజీ ఎమ్మెల్యే ప్రణబ్ ప్రకాశ్ దాస్ అధికారిక నివాసంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత సందర్భంగా జరిగింది ఘటన. ఈ అమానుషంపై జర్నలిస్టులు తీవ్రంగా మండిపడుతున్నారు. రఘునందన్ దాస్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.